# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ వికాసమే తమ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు.**
2. **సమాచార మాధ్యమాల ద్వారా ఓటర్లను చైతన్య పరుస్తూ ఓటింగ్ శాతాన్ని పెంచాలని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ 2024 ఫలితాలు విడుదలైయ్యాయి.**
4. **లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ ఈ రోజు తెలంగాణలో పర్యటిస్తారు.**
5. **పద కవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్ వికాసమే తమ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, అనేక ఖనిజాలు, దేవాలయాలు కలిగిన నేల రాయలసీమ అని అన్నారు. ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి లేదని, యువత ఉపాధి కోసం వలస వెళ్తున్నారని అన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు లేవని, ఎన్డీయే ప్రభుత్వం వస్తే సాగునీటి ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల-ఎర్రకుంట్ల రైల్వే లైన్ పనులు పూర్తయ్యాయని, కడప-బెంగళూరు మధ్య కొత్త రైల్వే లైన్ మంజూరైందని చెప్పారు. కడప విమానాశ్రయం కొత్త టెర్మినల్ నిర్మాణంలో ఉందని, వచ్చే ఐదేళ్లలో మౌలిక సదుపాయాల పనులు మరింత విస్తరిస్తామని తెలిపారు.

-------------------------

సమాచార మాధ్యమాల ద్వారా ఓటర్లను చైతన్య పరుస్తూ ఓటింగ్ శాతాన్ని పెంచాలని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నాల్గవ దశలో ఎన్నికల జరగనున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంసిద్ధతపై ఎన్నికల పరిశీలకులు, అధికారులతో దృశ్య మాధ్యమ విధానం ద్వారా నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 13న నాల్గవ విడత పోలింగ్ సజావుగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, పోలింగ్ స్టేషన్లలో ముఖ్యంగా వేసవి పరిస్థితులను

ఎదుర్కోవడానికి అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నాల్గవ దశలో ఎన్నికల జరిగే 14 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలు సునిశితమైన రాష్ట్రాలుగా ఎన్నికల సంఘం గుర్తించిందని.. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కొన్ని జిల్లాలు ఎంతో సునిశితమైన జిల్లాలుగా గుర్తించడమైందని, ప్రత్యేక పరిశీలకులు ఆయా జిల్లాలో తరచుగా పర్యటిస్తూ ఎటువంటి సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలని పేర్కొన్నారు.

---------------------------

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడలో నిన్న రాత్రి జరిగిన రోడ్ షో లో పాల్గొన్నారు. గన్నవరం విమానా శ్రయం నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ వచ్చిన ప్రధానమంత్రి ఎంజీ రోడ్డులో పీవీపీ మాల్ నుంచి బెంజిసర్కిల్ వరకూ 1.5 కిలో మీటర్ల దూరం రోడ్ షో నిర్వహించారు. రాత్రి 7గంటలకు ప్రారంభమైన రోడ్డు షో 8గంటల వరకు కొనసాగింది. ఈ రోడ్ షో లో ప్రధాన మంత్రితో పాటు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రధాని ఢిల్లీ బైయలుదేరి వెళ్లారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ ఈ రోజు తెలంగాణలో పర్యటిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు భువనగిరి లోక్ సభ నియోజకవర్గం పార్టీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ తరపున ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అలాగే రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు వరంగల్ తో పాటు జహీరాబాద్ లోక్ సభ స్థానం పరిధిలోని బాన్సువాడలో ఎన్నికల ప్రచారసభలో ప్రసంగిస్తారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఉదయం కర్నూలు పార్లమెంట్ పరిధిలోని కర్నూలు ఎస్వీ కాంప్లెక్స్ రోడ్డులో జరిగే ప్రచార సభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం అనంతపురం పార్లమెంట్ పరిధిలోని కళ్యాణ దుర్గం నియోజకవర్గం కొల్లపురమ్మ ఆలయం రోడ్డులో జరిగే సభలో పాల్గొంటారు. తర్వాత రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాజంపేట నియోజకవర్గంలో కోడూరు రోడ్డులో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ తెలిపారు.

---------------------------

ఐదవ దశ లోకసభ ఎన్నికలలో 5 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 49 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మొత్తం 695 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈనెల 20న ఎన్నికలు జరగనున్న ఈ లోకసభ నియోజకవర్గాల్లో మొత్తం 1586 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం 749 నామినేషన్లను స్వీకరించడం జరిగిందని తెలిపింది. కాగా ఐదో దశలో ఉత్తరప్రదేశ్లో 14 లోకసభ స్థానాలు మహారాష్ట్రలో 13, పశ్చిమ బెంగాల్‌లో ఏడు, బీహార్, ఒడిశాలో ఐదు చొప్పున, జార్ఖండ్‌లో మూడు, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో ఒక్కొక్క లోకసభ స్థానాలకు ఈనెల 20వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ 2024 ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి నిన్న విజయవాడలో విడుదల చేశారు. ఏప్రిల్ 27న పాలిసెట్ నిర్వహించారు. మొత్తం 1.42లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, 1.24లక్షల మంది అర్హత పొందారని, 87.61శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. ఇందులో బాలికలు 89.81శాతం, బాలురు 86.16 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపింది. ప్రవేశ పరీక్షలో పొందిన మొత్తం మార్కులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులకు ర్యాంకులు కేటాయించామని అధికారులు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

---------------------------

రానున్న రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, కోస్తాంధ్రల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అటు తెలంగాణలో రంగారెడ్డి, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

---------------------------

పద కవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఈరోజు. 1408వ సంవత్సరం మే 9 వతేదీన ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా తాళ్ళపాక గ్రామంలో జన్మించిన ఆయన... తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి, “అహోబిల” పుణ్యక్షేత్రంలోని నరసింహస్వామి, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ... 32 వేలకుపైగా కీర్తనలు రచించారు. ఈనాటికీ, ఏనాటికీ ఆబాలగోపాలాన్ని అలరించే అన్నమయ్య రచనలు.... తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. 1503వ సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీన తుదిశ్వాస విడిచిన అన్నమయ్య సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఖడ్గమైన “నందకం” అంశతో జన్మించారని పురాణాలు పేర్కొంటున్నాయి.

---------------------------

తెలంగాణాలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియను ఈ రోజు నుంచి ప్రారంభిస్తున్నట్లు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శ్రుతి ఓజా తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, మైనారిటీ, సహకార, గురుకుల, కేజీబీవీ తదితర జూనియర్ కళాశాలలన్నీ ఈ షెడ్యూల్‌ను పాటించాలని స్పష్టం చేశారు. ప్రైవేటు కళాశాలలు ప్రవేశాల కోసం ఎలాంటి పరీక్ష నిర్వహించరాదని, అలా నిర్వహించే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ప్రవేశాల కోసం ప్రకటనలు ఇస్తే వాటిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రవేశాల సమయంలో ప్రతి కళాశాల భవనం ప్రవేశద్వారం వద్ద.. మంజూరైన సెక్షన్లు, భర్తీచేసే సీట్ల వివరాలను రోజువారీగా ప్రదర్శించాలని, ప్రకటనలు ఇవ్వరాదని స్పష్టం చేశారు.

---------------------------

సంక్షేమంతోపాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందేలా పాలన అందిస్తామని జనసేన అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం హనుమాన్ జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లాలోని మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గన్నవరం విమానాశ్రయం బాధితులకు కూడా నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

---------------------------

దేశంలోని నవోదయ విద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తుల గడువును నవోదయ విద్యాలయ సమితి మరోసారి పొడిగించింది. నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 30తో గడువు ముగియగా.. ఇటీవల మే 7వరకు పొడిగించిన అధికారులు... తాజాగా ఆ గడువును మే14 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం ఒక వెయ్యి 377 నాన్ టీచింగ్ సిబ్బంది భర్తీకి అభ్యర్థులు మే 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

=====================